సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 9 । నవంబర్ । 2024



మురిసిన వంజంగి

ప్రముఖ పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌కు సందర్శకుల తాకిడి నెలకొంది. వారాంతపు రోజులతో సంబంధం లేకుండా ప్రతిరోజూ తరలివస్తున్నారు. పొగమంచు, సూర్యోదయం అందాలను వీక్షిస్తూ ఉత్సాహంగా గడుపుతున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు సందడి చేశారు. – సాక్షి, పాడేరు



గల్లంతైన వారి కోసం వలలు విసిరి గాలిస్తున్న మత్స్యకారులు



చిన గొంతియ్య మృతదేహాన్ని బయటకు తెచ్చిన ఎస్డీఆర్ఎఫ్ బృందం



మిగతా వారి కోసం గాలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు

రెక్కాడితే డొక్కాడని బతుకులు వారివి.. ఎప్పుడూ మాదిరిగానే ఏలేరు వాగు నుంచి ఇసుక తీసుకు వెళ్లేందుకు ట్రాక్టర్‌తో వచ్చారు. నిత్యం తవ్వేచోటే మరింత తవ్వుకుని నాలుగు డబ్బులు సంపాదిద్దామని ఆశపడి వాగులోకి దిగారు. తమ వెంట తెచ్చుకున్న స్టాండ్‌తో ఇంకాస్త లోతుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఊహించని పరిస్థితుల్లో ఒకరి తరువాత ఒకరు మునిగిపోయారు. స్టాండ్‌లో ఇరుక్కుపోయి బయటకు రాలేక నలుగురు గల్లంతయ్యారు. అడ్డతీగల మండలం బొంగరాలపాడు వద్ద జరిగిన ఈ హృదయ విదారక ఘటనలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి.

వాగులో విషాదం

ఇద్దరిని మింగేసిన 'ఏలేరు'



ప్రమాదం నుంచి బయటపడిన వీరమాల శామ్యూల్‌ను తీసుకెళ్తున్న కుటుంబ సభ్యురాలు

- ఏలేరు వాగులో ఇసుక సేకరణకు దిగిన నలుగురు గల్లంతు
- వారిలో ఇద్దరు తండ్రీకొడుకులు
- కుమారుడితోపాటు మరొకరి మృతదేహం లభ్యం
- మిగతా వారికోసం గాలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- అడ్డతీగల మండలం బొంగరాలపాడు వద్ద ఘటన
- సంఘటన స్థలంలో మిన్నంటిన రోదనలు
- తూర్పు లక్ష్మీపురంలో విషాద ఛాయలు



గల్లంతైన వారికోసం ఏలేరు వాగు ఒడ్డున రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఏలేరు వాగులో లభ్యమైన వీరమాల జయబాబు మృతదేహం

అడ్డతీగల/ఏలేశ్వరం: ఏలేరు వాగులో ఇసుక సేకరణకు దిగి గల్లంతైన నలుగురిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కావడంతో బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురానికి చెందిన వీరమాల భూషణం, వీరమాల జయబాబు, చిన గొంతియ్య, చింతా శ్రీను, శామ్యూల్ ఇసుక కోసం శుక్రవారం ఏలేరు వాగు వద్దకు ట్రాక్టర్‌తో వచ్చారు. వీరంతా బొంగరాలపాడు ప్రాంతంలో వాగులోకి దిగారు. తమ వెంట తెచ్చుకున్న స్టాండ్‌తో ఇంకాస్త లోతుకు వెళ్లేందుకు యత్నించారు. ఈ సమయంలో భూషణం మునిగిపోయాడు. అతన్ని రక్షించేందుకు పక్కనే ఉన్న జయబాబు, వారిని రక్షించేందుకు గొంతియ్య, చింతా శ్రీను ప్రయత్నించారు. వీరంతా స్టాండ్‌లో ఇరుక్కోవడంతో ఆపదనుంచి బయట పడలేక నలుగురు గల్లంతయ్యారు. ఈ ప్రమాదాన్ని కళ్లారా చూసి ఆందోళనకు గురైన శామ్యూల్ అస్వస్థతకు గురయ్యాడు. నెమ్మదిగా ఒడ్డుకు చేరుకున్న అతనిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

మత్స్యకారులు ప్రయత్నించినా..

నలుగురు మునిగిపోవడాన్ని సమీపంలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు గుర్తించారు. వెంటనే వలలు వాగులోకి విసిరి గాలింపు చేపట్టినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. డీఎస్పీ జి.సాయిప్రశాంత్, సీఐ నరసింహమూర్తి, తహసీల్దార్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టాయి. వీరమాల జయబాబు, చిన గొంతియ్య మృతదేహాలు లభ్యమయ్యాయి. వాటిని పోస్టు మార్టం నిమిత్తం నిమిత్తం అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మిగతా ఇద్దరి ఆచూకీ కోసం 31 మందితో కూడిన ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి.

కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలు

ప్రమాద సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని రోదించారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ సంఘటన స్థలానికి వచ్చారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. గాలింపు చర్యలపై డీఎస్పీ సాయిప్రశాంత్, సబ్‌కలెక్టర్ కల్పశ్రీతో మాట్లాడారు. ఇలావుండగా ప్రమాదానికి గురైన వారిలో భూషణం, జయబాబు తండ్రీ కొడుకులు. చిన గొంతియ్య భూషణం అల్లుడు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. చింతా శ్రీను వారి పొరుగున ఉంటున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

తల్లడిల్లుతూ..

భర్త భూషణం, కుమారుడు జయబాబు ప్రమాదానికి గురి కావడంతో వీరమల్లు లక్ష్మి తల్లడిల్లి పోయింది. కుమారుడు మృతితో ఆమె రోదన కలిచివేసింది. భర్త ఆచూకీ లభ్యం కాకపోవడాన్ని ఆమె తట్టుకోలేకపోతోంది.

ఆసరాగా నిలిచే కొడుకు గల్లంతుతో..

చింతా గోపి, సత్యవతిలకు ముగ్గురు సంతానం కాగా శ్రీనివాస్ పెద్దవాడు. కుటుంబానికి పెద్దవాడవడంతో కూలీ పనులు చేస్తూ ఆసరాగా నిలుస్తున్నాడు. అతడు గల్లంతవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురవుతోంది.

కూలిపనుల నిమిత్తం వచ్చి..

ఈ ప్రమాదంలో గల్లంతైన మరో వ్యక్తి చినగొంతియ్య భూషణానికి బంధువు. కూలి పనుల నిమిత్తం వచ్చి తూర్పు లక్ష్మీపురంలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. పని కోసం వచ్చి గల్లంతవడంతో చినగొంతియ్య కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఉచిత ఇసుక ప్రచారానికే పరిమితం

ప్రభుత్వం రాష్ట్రంలో తమకు సమీప వాగులు, వంకల్లో ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మండలంలోని బొంగరాలపాడు వద్ద ఏలేరు వాగులో ఇసుక తీసుకు వెళ్లే వారి నుంచి సమీప భూ యజమానులు, ప్రైవేటు వ్యక్తులు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఈ ప్రాంతం నుంచి ఇసుక భారీగా తరలిపోతోంది. ఇక్కడి ఇసుక మండల సరిహద్దు దాటి వెళ్లడం వారి పనితీరుకు ప్రత్యక్ష సాక్ష్యం. ఇతర ప్రాంతాల్లో ఇసుకకు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో ట్రాక్టర్లు, లారీలపై ఇసుక తరలిస్తున్నారు. వాగుల్లో ఇష్టానుసారంగా ఇసుకను తోడేయడం వల్ల గుంతలు ఏర్పడి మృత్యుకుహరాలుగా మారుతున్నాయి.

జీవో నంబరు 3 అమలు చేయాల్సిందే



పాడేరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న జీవో నంబరు 3 సాధన సమితి ప్రతినిధులు, విద్యార్థులు

- అసెంబ్లీ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలి
- చలో ఐటీడీఏ కార్యక్రమంలో జీవో నంబరు 3 సాధన సమితి డిమాండ్
- ర్యాలీ, నినాదాలతో దద్దరిల్లిన పాడేరు
- ప్రధాన రహదారిపై బైఠాయింపుతో ట్రాఫిక్ ఇబ్బందులు



ఐటీడీఏ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆందోళన కారులు



వినతిపత్రాన్ని అందజేస్తున్న జీవో నంబరు 3 సాధన సమితి ప్రతినిధులు

పాడేరు : అరకు ఎన్నికల ప్రచార సభలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని జీవో నంబరు 3 సాధన సమితి డిమాండ్ చేసింది. దీనిలో భాగంగా శుక్రవారం చేపట్టిన చలో ఐటీడీఏ కార్యక్రమంతో పాడేరు దద్దరిల్లింది. సాధన సమితి ప్రతినిధులు, పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు, పలు సంఘాల ప్రతినిధులు స్థానిక పాత బస్టాండ్ నుంచి సినిమాహాల్ సెంటర్ మీదుగా ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏను ముట్టడించేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఐటీడీఏ ఎదుట ప్రధాన రహదారిపై సుమారు రెండు గంటల పాటు బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవో నంబరు3ను పునరుద్ధరించి, త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంత ఉద్యోగాలన్నీ ఆదివాసీలకే కేటాయించాలని నినాదాలు చేశారు. మెగా డీఎస్సీకి బదులుగా గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధాన రహదారిపై కూర్చొని దిగ్బంధించడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో పోలీసులు ఆర్టీసీ కాంప్లెక్స్ లోపల నుంచి వాహనాలను మళ్లించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్‌కు అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సాధన సమితి ప్రతినిధులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్, ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్‌దేవ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవన్‌కృష్ణ, కార్తీక్ శ్రీను, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, కృష్ణ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతాల నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు లక్ష్మణరావు, చంటి, ఆదివాసీ మహిళా సంఘం ప్రతినిధులు హైమావతి, లత, ఏఐటీయూసీ నేతలు అమర్, రాజబాబు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి జంపరంగి ఆనంద్, మాతృభాష విద్యా వలంటీర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ఉద్యమించాలి

ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



గత ప్రభుత్వంలో వేసిన రివ్యూ పిటిషన్ పత్రాలను చూపిస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

ముంచంగిపుట్టు: జీవో నంబరు 3 అమలుకోసం పార్టీలకు అతీతంగా అందరూ పోరాడాలని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సభకు వచ్చిన ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవో నంబరు 3 అమలుకోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదని వస్తున్న ఆరోపణలపై ఆయన ఘాటుగా స్పందించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన కృషి, రివ్యూ పిటిషన్ పత్రాలను ఆయన చూపిస్తూ మాట్లాడారు. జీవో నంబరు 3 అమలు కాకుంటే గిరిజనులకు జరిగే నష్టంపై గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే గ్రహించారన్నారు. సుప్రీంకోర్టులో అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి జీవో నంబర్ 3కోసం 28 పేజీలతో రివ్యూ పిటిషన్ వేయించారన్నారు. చట్టబద్ధత కల్పించేందుకు న్యాయ స్థానాన్ని ఆశ్రయించారన్నారు. అడ్వకేట్ జనరల్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమై వారి నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారని అన్నారు. దీనికి అంతిమంగా రాజ్యాంగ సవరణ ఒకటే మార్గమని గుర్తించారని అన్నారు. ఇందుకోసం పోరాడుతున్న నేపథ్యంలో ఎన్నికలు రావడంతో తమ ప్రభుత్వం మారిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో నంబరు 3 కోసం పనిచేసినప్పటికీ, ఏమీ చేయలేదని విమర్శించడం తగదని ఆయన సూచించారు. గిరిజన యువతకు న్యాయం కోసం పార్టీలను పక్కనపెట్టి అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడితేనే సాధించగలమని ఆయన పేర్కొన్నారు.

'మద్యం సిండికేట్‌లో అధికారుల పాత్రపై విచారణ జరపాలి'

రంపచోడవరం : రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోన్న ఏడు మండలాల్లో మద్యం షాపుల సిండికేట్‌లో కీలకంగా వ్యవహరిస్తూ, ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తున్న గ్రూపు–2 అధికారి ముఖలింగం, ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న మరి కొంత మంది ప్రభుత్వ అధికారులపై పీసా చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, మట్ట వాణిశ్రీ డిమాండ్ చేశారు. మద్యం షాపుల సిండికెట్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న రాజమహేంద్రవరం డ్వామా పీడీ ముఖలింగం, కొంత మంది అధికారులపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపట్టాలని వారు కోరారు. వారి ఆర్థిక వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వీరిపై ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు వెల్లడించారు.

న్యూస్‌రీల్

విజృంభిస్తున్న చలిగాలులు

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- మినుములూరులో 14, అరకు, చింతపల్లిలో 18 డిగ్రీల నమోదు



పాడేరులో కురుస్తున్న పొగమంచు.. చలితో మంటను ఆశ్రయించిన స్థానికులు

సాక్షి,పాడేరు: మన్యంలో చలిగాలులు విజృంభిస్తున్నాయి. శుక్రవారం పాడేరు ప్రాంతంలో చలితీవ్రత పెరిగింది. పాడేరుకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద ఉదయం 17డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 18డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. లంబసింగి, తాజంగి, అన్నవరం, జి.మాడుగుల, అరకులోయ, పెదబయలు, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురిసింది.

డీఎస్సీ ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

రంపచోడవరం: ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా రెసిడెన్షియల్ డీఎస్సీ కోచింగ్ ఎంపికకు ఏపీ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ అనుమతి ఇచ్చినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. అయితే ఎస్సీ,ఎస్టీ విద్యార్థులను ఉచిత కోచింగ్‌కు ఎంపిక చేయడానికి కాకినాడ జిల్లా ఆదిత్య విశ్వవిద్యాలయం, సూరంపాలెంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించాల్సిన ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా పడినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్నందున వాయిదా పడిందన్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్షకు వెళ్లే విద్యార్థులు వాయిదా విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

విహారయాత్రకు వచ్చి..

సోకులేరు వాగులో కాలుజారి పడి యువకుడి మృతి



సత్యవరుణ్ మృతదేహం

మోతుగూడెం: విహారయాత్రకు స్నేహితులతో వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ సోకులేరు వాగులో జారిపడి మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన నలుగురు స్నేహితులు విహార యాత్రకు ద్విచక్ర వాహనాలపై వచ్చారు. దీనిలో భాగంగా సోకులేరు వ్యూపాయింట్ వద్ద ఆగి సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం స్నానాలు చేసేందుకు వాగు వద్దకు వెళ్లారు. వీరిలో గడ్డం సత్యవరుణ్ (20) ప్రమాదవశాత్తూ కాలు జారి వాగులో పడికొట్టుకుపోయాడు. అతనిని కాపాడేందుకు ముగ్గురు స్నేహితులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వెంటనే వారు మోతుగూడెం ఎస్ఐ శివనారాయణకు సమాచారం అందించారు. పోలీసులు సోకులేరు వాగు వద్దకు చేరుకున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే దగ్గరలో ఉన్న లక్కవరం నుంచి గజ ఈతగాళ్లను రప్పించారు. సోకులేరు వాగు గాలింపు చేపట్టిన కొద్దిసేపటికి గల్లంతైన సత్యవరుణ్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ ఖైదు

విశాఖ లీగల్/కొయ్యూరు: ఒక వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన ముగ్గురికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.60 వేలు చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తన తీర్పులో పేర్కొన్నారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు.. నిందితులు అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని బోదరాపల్లికి చెందిన గిడుతూరి సింహాచలం, కొర్ల బజ్జయ్య, అలాగే సుద్దుల గడ్డ ప్రాంతానికి చెందిన గేమిలి రాంబాబు, కొర్ల బుజ్జి, గమ్మిలి శ్రీను మధ్య భూతగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో 2010 మార్చి 13న రాంబాబు మరో ఇద్దరు కలిసి గునపాలు, కత్తులు, పారలు, కర్రలు తదితర మారణాయుధాలతో సింహాచలం, బొజ్జయ్యలపై దాడి చేసి చంపేశారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు మంప పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. రెండవ నిందితుడు గమిలి శ్రీనుకి అదనంగా రూ.30 వేలు జరిమానా విధించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి

8లో

డిమాండ్ మేరకే విద్యుత్ ఉత్పత్తి

సీలేరు జలవిద్యుత్‌కేంద్రం ఈఈ రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న ఈఈ రాజేంద్రప్రసాద్

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో డిమాండ్ మేరకు విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం 240 మెగావాట్లతో నాలుగు యూనిట్లు వినియోగంలోకి వచ్చాయన్నారు. లోడ్ డిస్పాచ్ ఆదేశాల మేరకు పైఅధికారులు ఎప్పుడు విద్యుత్ అడిగినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రెండు రోజుల క్రితం 4వ నెంబరు యూనిట్‌లో చిన్నపాటి బ్రేక్ ఆగ్జలరీ స్విచ్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో దాని ద్వారా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. సాంకేతిక సమస్యను సరిచేసి శుక్రవారం నుంచి 4వ నంబరు యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలో హైడల్ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్‌కు అంత డిమాండ్ లేనందున పగటి పూట ఒక యూనిట్‌తో రాత్రిపూట రెండు యూనిట్లతో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ఇదంతా లోడ్ డిస్పాచ్ అధికారుల ఆదేశాల మేరకు జరుగుతుందని పేర్కొన్నారు. సీలేరు బేసిన్‌లో నీటి నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రానున్న రోజుల్లో విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఈఈ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీల సమస్యల పరిష్కారానికి కృషి

పాడేరు: గ్రామ సచివాలయాల హెల్త్ సెక్రటరీల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా శెట్టి నాగరాజు, జిల్లా అధ్యక్షురాలిగా కుమారి, ప్రధాన కార్యదర్శిగా తులబొతి, కోశాధికారిగా అంబికా, ఉపాధ్యక్షురాలిగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శిగా అనితరాణితో పాటు పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాలకు అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

క్లుప్తంగా

క్షతగాత్రులకు భద్రాచలం ఎమ్మెల్యే సాయం


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే వెంకటరావు

ఎటపాక: ఎటపాక సమీపంలో శుక్రవారం సాయంత్రం ఓ ఆటో అదుపుతప్పి బోర్లాపడి ప్రమాదానికి గురైంది. దీంతో ఆటోలో ఉన్న దుమ్ముగూడెం మండలం వ్యవసాయాధికారి నవీన్‌కుమార్‌తో పాటు మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. అయితే ఆ సమయంలో చర్ల మండలంలో పర్యటనను ముగించుకుని భద్రాచలం వస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఘటనా స్థలంలో తన వాహనం ఆపి ప్రాణాపాయస్థితిలో ఉన్న నవీన్‌కుమార్‌ను తన సొంత వాహనంలో భద్రాచలం తరలించారు. తన పీఏ కళ్యాణ్ ప్రమాదంలో క్షతగాత్రులను మోసుకుని అంబులెన్స్‌లో ఎక్కించి సహాయపడ్డారు.

పశుగణనతో పాడి రైతులకు ప్రయోజనం

పెదబయలు: పశు గణన నమోదు కార్యక్రమం వల్ల పాడి రైతులకు ప్రయోజనం కలుగుతుందని పశుసంవర్ధకశాఖ ఏడి ఎల్.రాజారవికుమార్ అన్నారు.మంలడలంలో గల సీతగుంట,రూడకోట, కృష్ణాపురం, ముక్కిపుట్టు, బొర్లాడ, పెదబయలు గ్రామాల్లో పశు సిబ్బంది చేస్తున్న పశుగణన కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. దగ్గర నుంచి పశు గణన చేయించారు. ఈ సందర్భంగా ఏడీ రాజారవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి జాతీయ పశుగణన జరుగుతుందని, క్షేత్రస్థాయిలో పశువుల వివరాలు నమోదు వల్ల పెంపకందారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. నవంబర్ నెల నుంచి ఫిబ్రవరి వరకు సర్వే జరుగుతుందని, రైతులంతా సహకరించాలని ఆయన కోరారు.

సత్యనారాయణకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న సత్యనారాయణ

పాడేరు : తనకు డాక్టరేట్ లభించినట్టు మండలంలోని కాడెలి పంచాయతీ వర్తనాపల్లి గిరిజన గ్రామానికి చెందిన దుద్దు సత్యనారాయణకు తెలిపారు. ఆయన గత ఐదేళ్లగా పలు సామాజిక అంశాలపై గిరిజనులను చైతన్యపరుస్తున్నారు. గిరిజన చట్టాలు, హక్కులపై పాటలు రాస్తూ తన గాత్రంతో గిరిజనులను చైతన్యవంతం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం గిరిజనుల సమస్యలను తెలుసుకునేందుకు గ్రామ చైతన్య యాత్ర పేరుతో ఏజెన్సీలో పాదయాత్ర నిర్వహించారు. ఇందుకుగాను న్యూఢిల్లీకి చెందిన ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధులు ఈనెల ఏడున డాక్టరేట్‌తో సత్కరించినట్టు సత్యనారాయణ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి
- ముంచంగిపుట్టులో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సభ


మాట్లాడుతున్న అరకు ఎంపీ తనూజరాణి, వేదికపై అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే హైమావతి, ప్రజాప్రతినిధులు

ముంచంగిపుట్టు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అన్ని వేళలా అండగా ఉంటామని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజ రాణి తెలిపారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమ్మేళనం, సన్మాన సభను శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి,అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం,ఎమ్మెల్సీ కుంభ రవిబాబు,ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే హైమవతిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరికి మండల వైఎస్సార్‌సీపీ నేతలు, సర్పంచులు,ఎంపీటీసీలు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఎంతో శ్రమించి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేశారని, మీ కష్టంతో మేము ఈ స్థాయిలో ఉన్నామన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్‌సీపీకి గిరిజనులు కంచుకోటగా నిలుస్తారని మరోసారి రుజువు చేశారని చెప్పారు. గిరిజన ప్రాంతం సమస్యల పరిష్కారం కోసం అనుక్షణం పని చేస్తామని ఆమె తెలిపారు. అనంతరం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గిరిజన ప్రాంత వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల నిబద్ధత,విశ్వసనీయత వెలకట్టలేనిదన్నారు. ఎమ్మెల్యేగా నా గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఎల్లవేళలా రుణపడి ఉంటానని,గిరిజన ప్రాంత అభివృద్ధి,మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. త్వరలోనే గ్రామాల్లో పర్యటనలు చేసి గిరిజనుల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు తెలిపారు. అనంతరం ఎంపీ గుమ్మ తనూజరాణి,వినయ్ దంపతులకు,అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం,ఎమ్మెల్సీ రవిబాబు,ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే హైమవతిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు,ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ఎంపీపీ సిరగం భాగ్యవతి,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్‌ధన్ వికాస్ కేంద్రాలతో ఆర్థిక చేయూత


అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : వన్‌ధన్ వికాస్ కేంద్రాలను అభివృద్ధి చేసి గిరిజన మహిళలకు ఆర్థిక చేయూత అందించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఐటీడీఏ అధికారులు, వెలుగు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌ధన్ వికాస్ కేంద్రాల భవనాలకు మరమ్మతులు చేపట్టి 12 వీడీవీకే హబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. చింతపండు, పసుపు, కొండచీపుళ్లు, కాఫీ, అడ్డాకుల తయారీ వీడీవీకే కేంద్రాల ద్వారా చేపట్టి విక్రయించాలన్నారు. పాడేరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన వీడీవీకేలలో గిరిజన ఉత్పత్తులను ప్రారంభించాలని సూచించారు. గతంలో మంజూరు చేసిన 106 వన్‌ధన్ వికాస్ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అడ్డాకుల తయారీ హబ్‌లు ఐదు, కొండ చీపుర్ల హబ్‌లు రెండు, చింతపండు హబ్‌లు రెండు, కాఫీ పౌడర్ తయారీ హబ్‌లు మూడు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీఓలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ మురళి, వెలుగు ఏపీఎం ప్రసాద్, సిబ్బంది శంకర్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

8 మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అరకులోయ రూరల్: మండలంలోని లిటిగుడ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి వారి నుంచి రూ.5,245 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ గోపాల్‌రావు శుక్రవారం తెలిపారు. పటుబడిన వారిలో రఘురాం, లిటిగుడ, శెట్టి, దావిద్, శంకర్, బలరాం, భగవాన్, పాడొం ఉన్నట్టు చెప్పారు.

ముగిసిన నేక్ బృందం పర్యటన

రెండు రోజుల డిగ్రీ కళాశాల పరిశీలన విజయవంతం


ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో నేక్ చైర్మన్ రమేష్‌శర్మ, సభ్యులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల నేక్ బృందం పర్యటన విజయవంతంగా ముగిసింది. నేక్ చైర్మన్ రమేష్‌శర్మ, కో-ఆర్డినేటర్ సభ్యులు కులభూషణ్ చందేల్, సుస్మగోస్లేలు రెండవ రోజు శుక్రవారం కళాశాలను సందర్శించారు.కంప్యూటర్ విభాగం, క్యాంటీన్, కళాశాల గార్డెన్, మెడిసెన్ ప్లాంటేషన్, వర్మీకంపోస్ట్ యూనిట్, నైపుణ్యాభివృద్ధి ల్యాబ్‌లను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోను వారు సమావేశమయ్యారు. కళాశాలలో అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను తెలుసుకున్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా చేపడుతున్న రెగ్యులర్ కార్యక్రమాలను సమీక్షించారు. వ్యాయామ విభాగాన్ని సందర్శించి పలు అంశాలపై పీడీకి పలు సూచనలిచ్చారు. అనంతరం కళాశాల ఆవరణలో పలు పండ్లజాతుల మొక్కలు నాటడంతో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ఆత్మీయ ఫోటో దిగారు.రెండు రోజుల పర్యటనలో ఈ బృందం పరిశీలించిన అన్ని అంశాల సమగ్ర నివేదికను కళాశాల అధ్యక్షుడు, ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.కోటేశ్వరరావులకు నేక్ చైర్మన్ రమేష్‌శర్మ, ఇతర సభ్యులు అందజేశారు.అనంతరం నేక్ బృందానికి వారంతా ఘనంగా వీడ్కోలు పలికారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎస్.రసూల్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల వెల్లువ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్


వినతులు ఇచ్చేందుకు అధిక సంఖ్యలో వచ్చిన గిరిజనులు


అధికారులకు అందజేసిన వినతిపత్రాన్ని చూపిస్తున్న జీకే వీధి ఎంపీటీసీ, సర్పంచ్, స్థానికులు

మీకోసం కార్యక్రమంలో 142 అర్జీలను స్వీకరించిన అధికారులు

పాడేరు : ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై 142 వినతులు అందాయి. వినతులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీఓ అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మలత కలిసి స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ సమస్యలపై ప్రజల నుంచి వస్తున్న అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, నిర్ణీత కాల వ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌బీఎస్ నందు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేష్‌కుమార్‌రావు, సెరీ కల్చర్ ఏడీ అప్పారావు, టీడబ్ల్యూ, ఆర్‌అండ్‌బీ ఈఈలు జి.డేవిడ్‌రాజు, బాలసుందర్‌బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, ఎల్‌డీఎం మాతు నాయుడు, టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజనీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: అమ్మవారి దారకొండ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేయాలని కోరుతూ శుక్రవారం పాడేరులో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో వినతులు ఇచ్చినట్టు ఎంపీటీసీ వంపురంగి బుజ్జిబాబు,సర్పంచ్ రమారావు తెలిపారు. పంచాయతీలో రోడ్డును వేయాలని, పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని, పాడైన చెక్‌డ్యాంలను మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త వాటిని నిర్మించాలని వినతిలో పేర్కొన్నట్టు చెప్పారు. ఐటీడీఏ పీవో అభిషేక్ దీనిపై స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను పీవోకు తెలియజేశామన్నారు. గ్రామస్తులు చంటిబాబు, మల్లేశ్వరరావు, ఆనందరావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు అరికట్టాలి


మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం


హాజరైన వైద్యులు, సిబ్బంది

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలో మాతాశిశు మరణాలు సంభవించకుండా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ జరగాలని, అందుకు పీహెచ్‌సీ వైద్యాధికారులు కీలకంగా పనిచేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సూచించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో అన్ని ఆస్పత్రుల్లో మాతాశిశు మరణాలు సంభవించకుండా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సుఖప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గర్భిణుల ఆరోగ్య వివరాలపై పీవో సమీక్షించారు. ఆస్పత్రిలో ప్రసవాల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. మాతాశిశు మరణాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో జి. శిరీష, ఆర్‌ఎంవో ఇందిర, ఆస్పత్రి సూపరింటెంటెంట్ డా. శేషురెడ్డి, వైద్యులు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సీలేరు జల విద్యుత్ కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

సీలేరు: ఎపి జెన్‌కో సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ 4జి సేవలను శుక్రవారం నుంచి ప్రారంభించారు. సీలేరు గ్రామానికి 3 కి.మీ దూరంలో ఉన్న ఈ జలవిద్యుత్ కేంద్రానికి సమాచార వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. గతంలో సీలేరులో నూతన టవర్ నిర్మాణం జరిగే సమయంలో జల విద్యుత్ కేంద్రానికి కూడా టవర్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు పంపడంతో 2జి టవర్‌ను నిర్మించారు.
పదిరోజుల క్రితం సీలేరు గ్రామంలో రెండు చోట్ల 4జి సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు జలవిద్యుత్ కేంద్రంలో ఉన్న టవర్‌కు కూడా 4జి పరికరాలు అమర్చి శుక్రవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో జలవిద్యుత్ కేంద్రంలో పనిచేసే ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

పెదబయలు: మండల కేంద్రంలోని ఏపిఆర్, ఏకలవ్య పాఠశాలలు, కళాశాలలను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏ ఇబ్బందులున్నా దృష్టికి తీసుకురావాలని, చదువుపై పూర్తిగా దృష్టి పెట్టాలన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేలేదని, చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మత్స్యలింగం హెచ్చరించారు. ఏకలవ్య పాఠశాలలో తాగునీటి సమస్యను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆర్‌డబ్ల్యూఎస్ నిధులతో రెండు బోర్లు మంజూరు చేయించి, బోర్లు వేయించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తదితరులు అరకు ఎమ్మెల్యే మత్స్యలింగనకు శాలువా కప్పి సన్మానించారు. ఎంపీడీవో పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల నిరసన దీక్షకు మద్దతు


వీవోఏలతో మాట్లాడుతున్న ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: మూడేళ్ల కాలపరిమితి విధానం రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో వెలుగు వీవోఏలు చేపట్టిన నిరసనకు దీక్షకు అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని శుక్రవారం వారు సందర్శించారు. వారి డిమాండ్లను కలెక్టర్, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో వీవోఏలు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైస్ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పద్మారావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి నిర్మాణం


రహదారి నిర్మాణానికి బండరాయిని తొలగిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ జర్రెలపాదర్ గిరిజనులు శ్రమదానంతో వారం రోజులు కష్టపడి తాత్కాలిక రహదారి నిర్మించుకున్నారు. శుక్రవారంతో పనులు పూర్తయ్యాయి.డుమడగూడ నుంచి జర్రెలపాదర్ వరకు 5 కిలో మీటర్లు రహదారి కోసం కొండలు తవ్వి, ,మట్టి చదును,పెద్ద పెద్ద బండరాళ్లను తీసి తాత్కాలిక రహదారిని పూర్తి చేశారు.ఈ సందర్భంగా జర్రెలపాదర్ గ్రామ గిరిజనులు కళ్యాణ్, గోపాల్,జయరాం,దశరద్,సురేష్‌లు మాట్లాడుతూ గ్రామానికి సరైన రహదారి లేక ఎన్నో ఏళ్ల నుంచి రవాణా కష్టాలు పడుతున్నామని, ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గృహ మంజూరు చేస్తున్న నిర్మాణ సామగ్రి తరలించలేని పరిస్థితి నెలకొందని, దీనిపై సుమారు ఆరుసార్లు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను పాడేరులో కలిసి రహదారి సమస్యను తెలిపిన స్పందన లేదని, దీంతో గ్రామస్తులంతా శ్రమదానంతో తీవ్రంగా కష్టపడి తాత్కాలిక రహదారిని నిర్మించామన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి నూతన రహదారి మంజూరు చేసి రవాణా కష్టాలు తీర్చాలని వారు కోరారు.

60 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరు అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయిని తూనిక వేస్తున్న ఎస్ఐ రామకృష్ణ, పోలీసులు

ముంచంగిపుట్టు : మండలంలో గల దొడిపుట్టు జంక్షన్ వద్ద శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 60 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్టు పక్కా సమాచారంతో పోలీసు సిబ్బందితో దొడిపుట్టు జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బైకులతో వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి రెండు బస్తాలను వదిలి పారిపోగా చాకచక్యంతో వారిలో ఒకరిని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడ్డ గంజాయిని వీఆర్‌వో విజయలక్ష్మి సమక్షంలో తూనిక వేయించగా 60 కిలోలు ఉందని, దీని విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నలుగురు పరారవగా, వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. గంజాయి రవాణాకు పాల్పడితే కేసుల నమోదుతో పాటు ఆస్తులు సీజ్ చేయడం జరుగుతుందని, ఎక్కువ కేసులు నమోదయ్యే నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించవలసి వస్తుందని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు.